క్లుప్తంగా

ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు



కోహాపల్లిలో విద్యార్థులతో ఎంపీపీ శ్రీనివాస్

పెద్దశంకరంపేట(మెదక్): ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలని పేట ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. సోమవారం కోహాపల్లి గ్రామంలో పాఠశాలల ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులకు పుష్పాలు అందించి ఆహ్వానించి బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనర్సింలు, రాజు, హెచ్‌ఎం కుమార్, పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు రామచంద్రాచారి, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్



చెక్కు అందజేస్తున్న మాజీ ఎంపీ సురేష్ షెట్కార్

పెద్దశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా ఉంటుందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేట మండలంలోని చీలాపల్లి గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి గతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల సభ్యత్వ బీమా చెక్కును ఆయన తండ్రి సంగారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్, రాష్ట్ర ఓబీసీ ప్రధాన కార్యదర్శి జనార్దన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయిని మధు, పట్టణాధ్యక్షుడు గంగారెడ్డి, రవీందర్, జైపాల్‌గౌడ్, యేసురెడ్డి, సాయిరెడ్డి, మల్లయ్య, భూమయ్య, సాయిలు, మహిపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లింగాయత్‌లకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలి

వీరశైవ లింగాయత్ లింగబలిజ రాష్ట్ర నాయకుడు శివశరణ్



అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వం వీరశైవ లింగాయత్, లింగబలిజ కులస్తులకు, కులవృత్తులకు అందించే లక్షా రూపాయల ఆర్థిక సాయం అందించాలని వీరశైవలింగాయత్ లింగబలిజ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివశరణ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడు తూ.. లింగాయత్ కులస్తులలో చాలా మంది ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. లింగాయత్ ఓట్లతో రాజకీయ పార్టీలు లబ్ధి పొందుతున్నా.. సంక్షేమ పథకాలలో అవకాశాలు కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన చేస్తామని అన్నారు.

అక్రమ కలప రవాణా అడ్డగింత



డీసీఎంలో తరలిస్తున్న కలప

వెల్దుర్తి(తూప్రాన్): అక్రమంగా కలప రవాణా చేస్తున్న డీసీఎంను పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు మంగళపర్తి అటవిశాఖ సెక్షన్ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని మానెపల్లి శివారులో మామిడి చెట్లను నరికివేసి ఆ కలపను డీసీఎంలో నింపి అర్ధరాత్రి తరలిస్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో వెళ్లి తనిఖీ నిర్వహించగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా కలప రావాణా చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో డీసీఎంను పట్టుకొని వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

ఉద్యోగుల సంక్షేమానికి టీఎన్జీవోల సంఘం కృషి

రామాయంపేట(మెదక్): టీఎన్జీవో సంస్థ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు దొంతి నరేందర్ అన్నారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు ఏదైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే చాలా వరకు సమస్యలు పరిష్కరించమన్నారు. తన జన్మదినం సందర్భంగా నరేందర్ కేక్ కట్ చేసి, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం తాలూకా అధ్యక్షుడు ప్రభాకర్, ఇతర ప్రతినిధులు నిఖిల్ శ్రీనివాస్, గాంధీ, గణేశ్, సాయి, నాంపల్లి, నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గూడూర్‌లో దూడల ప్రదర్శన

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని గూడూర్ గ్రామంలో మంగళవారం మేలు జాతి దూడలను ప్రదర్శించనున్నట్లు సూపర్ వైజర్ సత్యనారాయణ తెలిపారు.

గ్రామాభివృద్ధికి బిల్లులు ఇప్పించండి

కొల్చారం మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల డిమాండ్



మాట్లాడుతున్న ఎంపీపీ మంజుల

కొల్చారం(నర్సాపూర్): గ్రామ అభివృద్ధి కోసం ఖర్చు చేసిన బిల్లులను వెంటనే ఇప్పించాలని కొల్చారం మండలం సర్పంచ్‌లు సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో డిమాండ్ చేశారు. ఎంపీపీ మంజుల అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు ఇతర అంశాలపై తమ నివేదికలను సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా కిష్టాపూర్ సర్పంచ్ గోదావరి మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమానికి సొంత ఖర్చులను ఖర్చు చేశామని, ఇప్పటికీ బిల్లులు మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. గ్రామంలో విద్యుత్ సమస్యలు తరచూ తలెత్తుతున్నప్పటికీ ట్రాన్స్‌కో ఏఈ మాత్రం ఫోన్ చేసినా స్పందించడం లేదంటూ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఈ సమావేశానికి ఏఈ హాజరు కాలేదు. వచ్చే వర్షాకాలానికి పూర్తిస్థాయిలో చెరువులు, కుంటల్లో నీవు వృథా పోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఏఈ మహేశ్ తెలిపారు. పంచాయతీరాజ్ ఇర్ఫాన్ మాట్లాడుతూ.. వరిగుంతం రోడ్డుతో పాటు మండల కేంద్రం నుంచి అంశాన్ని పల్లి వరకు రీబీటీ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. పీఏసీఎస్ చైర్మన్లు మాట్లాడుతూ.. మండలంలో అర్హత లేని వారికి ఫర్టిలైజర్ షాప్‌ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడంపై వ్యవసాయ అధికారి శ్వేతా కుమార పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అంటువ్యాధులు తలెత్తకుండా వైద్య సిబ్బంది గ్రామాల్లో తరచు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు, ఎంపీఓ కృష్ణవేణి, సర్పంచ్‌లు సుజాత, కిష్టయ్య, రమేశ్, ఎంపీటీసీ ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి సురేష్‌నాయక్

భూకబ్జాలను ఆపండి

నర్సాపూర్ మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు

నర్సాపూర్ రూరల్: మండలంలో కొనసాగుతున్న అక్రమ భూకబ్జాలను, అక్రమ మట్టి రవాణాలను ఆపాలని కాజీపేట, లింగాపూర్ ఎంపీటీసీలు ఆంజనేయులు గౌడ్, శ్రీనివాస్‌గుప్తా అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం నర్సాపూర్ ఎంపీపీ జ్యోతి సురేష్‌నాయక్ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని రోజులుగా నర్సాపూర్ పట్టణాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూములను కొంతమంది కబ్జా చేస్తున్నా.. ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో పాటు పలు చెరువులు, కుంటల నుంచి పెద్ద ఎత్తున టిప్పర్ల ద్వారా అక్రమ మట్టి రవాణా కొనసాగుతున్న రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ..బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఎంపీఓ వైద్య శ్రీనివాస్ మాట్లాడుతూ.. చిప్పల్‌తుర్తి గ్రామ పంచాయతీకి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు రాగా పెద్ద చింతకుంటకు జిల్లా స్థాయి అవార్డు వచ్చిందన్నారు. ఆర్ అండ్‌బీ ద్వారా ఆరు రోడ్లకు నిధులు మంజూరు కాగా టెండర్లు పిలిచేందుకు ప్రక్రియ సిద్ధమవుతుందని అధికారులు చెప్పారు. మండల పరిషత్ ఆవరణలో విశ్రాంత ఉద్యోగులకు స్థలం కేటాయించేందుకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. తూతూ మంత్రంగా ఆయా శాఖలో జరిగిన అభివృద్ధి పనులను అధికారులు సమావేశంలో వివరించారు. తక్కువ సంఖ్యలో ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మార్టిన్ లూథర్, వైస్ ఎంపీపీ నర్సింగ్‌రావు, ఆయా శాఖ అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్నకాంగ్రెస్ నాయకులు

తూప్రాన్: రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు కబ్జా చేశారని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం ఆర్డీఓ శ్యాంప్రకాశ్‌కు వినతి అందజేశారు. మున్సిపల్ 10వ వార్డు వెంకటాపూర్(పీటీ) పరిధిలోని సర్వేనంబర్ 160లో 13.01 ఎకరాలు, 205లో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని అధికార పార్టీకి చెందిన నాయకులు అధికార బలంతో కబ్జా చేసి ఆక్రమించారు. కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు రవీందర్‌గుప్తా ఆధ్వర్యంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి రూ.కోట్లల్లో ధర పలుకుతుందన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్యాంప్రకాశ్, తహసీల్దార్ జ్ఞానజ్యోతిలకు వినతిపత్రం వేర్వేరుగా అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రవీందర్‌గుప్తా, సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, సాయికుమార్, అనిల్, లక్ష్మణ్, శశిభూషణ్‌రెడ్డి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలపై అవగాహన



క్విజ్‌పోటీలపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

పెద్దశంకరంపేట(మెదక్): ఈ నెల 18న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేట మండలం గొట్టిముక్కల గ్రామంలో యువతకు క్విజ్‌పోటీలపై అవగాహన కల్పించి, కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయాలను ప్రచారం చేసేందుకు క్విజ్ పోటీలను చేపడతున్నా మన్నారు. ఇందులో గెలుపొందిన వారికి నియోజకవర్గానికి ఒకరికి ఎలక్ట్రిక్ బైక్, ల్యాప్‌టాప్, ట్యాబ్లెట్, స్మార్ట్ ఫోన్‌లు అందజేస్తామన్నారు. క్విజ్‌లో పాల్గొనే వారు 76618 99899కి మిస్ కాల్ ఇస్తే లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 17లోగా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, జహంగీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): ఈ నెల 18న రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని టేక్మాల్ జెడ్పీటీసీ సరోజమల్లేశం సోమవారం తెలిపారు. తెలంగాణ యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు క్విజ్ పోటీలను నిర్వహిస్తుందని, పోటీలో గెలుపొందిన వారికి బహుమతులను టీపీసీసీ అందజేస్తుందని తెలిపారు. 16 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వారు పోటీలో పాల్గొనవచ్చునన్నారు. పోటీలో పాల్గొనాలనుకునే వారు ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. httpr://www.rajivfandhiyouthquiz.comపై లింక్ ద్వారా అందరూ రిజిస్టర్ చేసుకొని క్విజ్‌లో పాల్గొనాలని తెలిపారు.

నేడు మహిళా సంక్షేమ దినోత్సవం

మెదక్ కలెక్టరేట్: నేడు జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో మహిళా సంక్షేమ దినోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తామని కలెక్టర్ రాజర్షిషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ నియోజకవర్గానికి సంబంధించి శ్రీ సాయి బాలాజీ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు, నర్సాపూర్ నియోజకవర్గానికి సంబంధించి నర్సాపూర్‌లోని సాయి కృష్ణ ఫంక్షన్ హాల్ నందు ఉదయం పదిన్నర గంటలకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు పింఛన్లు, కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య మహిళా, 33 శాతం రిజర్వేషన్, షీ టీమ్స్, వి హబ్ ఏర్పాటు, అంగన్‌వాడీలకు, ఆశ వర్కర్లకు వేతనాలు పెంపు వంటి విషయాలు ప్రస్తావించడంతో పాటు మహిళా ఉద్యోగులను సన్మానిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా ఉద్యోగులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

కుమ్మరుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కౌడిపల్లి(నర్సాపూర్): కుమ్మరి కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంబీసీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయంలో మండల కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ఒడిబియ్యం పోసి బోనాలు తీశారు. కార్యక్రమానికి ఆయన హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరయ్య, మండలాధ్యక్షుడు గంగయ్య, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

వడ్ల లారీలు వాపస్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాయిలాపూర్ వరిధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి కామారెడ్డికి వెళ్లిన వడ్ల లారీలు అక్కడ ఖాళీ కాకపోవడంతో మూడు రోజుల తర్వాత తిరిగి గ్రామానికి వచ్చాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రోజుల పాటు కామారెడ్డిలో ఉండి తిరిగి రావడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో స్పందించిన సొసైటీ సీఈఓ దుర్గాగౌడ్, సర్పంచ్ కురుమ శేఖులు, సొసైటీ డెరెక్టర్ నర్సింలు విషయాన్ని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. నర్సాపూర్‌లోని రైస్‌మిల్‌కు పంపించి లోడ్ ఖాళీ చేసే ఏర్పాట్లు చేశారు.

14న ఆరోగ్య దినోత్సవం

రామాయంపేట(మెదక్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14న రామాయంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి సోమవారం పేర్కొన్నారు.

రేపు మండలంలో సర్వసభ్య సమావేశం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ వినోదరెడ్డి, ఎంపీడీఓ శశిప్రభ సోమవారం తెలిపారు.

‘పని’ బాటలో విద్యార్థులు

అటెండర్ లేకపోవడంతో విద్యార్థులతో పనులు



చిన్నశంకరంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనులు చేస్తున్న విద్యార్థులు



తోరణాలు కడుతున్న విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): పాఠశాల తొలిరోజునే విద్యార్థులు పనిబాట పట్టారు. అటెండర్ లేకపోవడంతో పాఠశాలలో విద్యార్థులు పనిలో నిమగ్నమయ్యారు. సోమవారం చిన్నశంకరంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు స్వాగత తోరణం కట్టేందుకు ఎత్తైన ఆర్చి పైకి ఎక్కడానికి బరువైన స్టాండ్ మోశారు. అలాగే స్టాండ్‌పైకి ఎక్కి ప్రమాదపుటంచున ఉండి మామిడి తోరణాలు కట్టారు. ఉపాధ్యాయులు అక్కడే ఉండి ఎత్తైన స్టాండ్స్ పైకి విద్యార్థులను ఎక్కించారు. ఈ విషయమై హెచ్‌ం విశ్వనాథం మాట్లాడుతూ.. పాఠశాలలో అటెండర్ లేకపోవడంతో విద్యార్థులతో మామిడి తోరణాలు కట్టియాల్సి వచ్చిందని తెలిపారు.

చెరువులు, కుంటల వివరాలు సేకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ తులసీరాం

అల్లాదుర్గం(మెదక్): ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్‌కు సంబంధించి మండలంలో చెరువులు, కుంటలు, కట్టుకాల్వలు, పూర్తి వివరాలు సేకరించాలని తహసీల్దార్ తులసీరాం చెప్పారు. సోమవారం కార్యాలయంలో వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువు, కుంటలు, కట్టుకాల్వ పరిస్థితిపై వివరాలు ఇవ్వాలన్నారు. చెరువుల పరిస్థితి, కాల్వల పరిస్థితిపై పూర్తి స్థాయి వివరాలు సేకరించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ తిలక్‌రాజ్, ఏఓ రాజేశ్, ఏఈఓలు మహేశ్, రాజేశ్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లిలో పట్లోరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 2 లక్షలతో పది సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డితో కలిసి ఫౌండేషన్ డైరెక్టర్ ఎన్‌ఆర్‌ఐ నితిన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత గ్రామానికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సీసీ ఏర్పాటుతో నేరాలు అదుపులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రజినీసుధాకర్, ఎంపీటీసీ శివయ్య, నాయకులు శ్రీనివాసరావు, కేశవరావు, నర్సింగారావు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

‘ఉద్యోగాలు భర్తీ చేయలేదు ’

నిజాంపేట(మెదక్): నిరుద్యోగుల ఉద్యోగాలు భర్తీ చేయలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బచ్చురాజ్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు వినోద్ ప్లాట్లీపామ్ ప్రారంభం సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగాలు భర్తీ చేసిన పాపనపోలేదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగం గౌడ్, ఉపాధ్యక్షుడు మారుతి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పంజా మహేందర్, పట్టణాధ్యక్షుడు నసీరుద్దీన్, సేవల అధ్యక్షుడు ముత్యాల మధుసూదన్‌రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు చంద్రం,ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజయ్య, నరేందర్, మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, స్వామి, జిల్లా యువజన అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, రామచంద్ర గౌడ్, యాదగిరి, మహేశ్, ఆకుల బాలయ్య, భూమా గౌడ్, సులేమాన్, స్వామి, బొమ్మెన మల్లేశం, పరశురాములు, సిద్ధరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఆర్డీ జిల్లా ఉపాధ్యక్షుడిగా గౌతమ్



మెదక్ మున్సిపాలిటీ: దివ్యాంగుల హక్కుల జాతీ య వేదిక మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడిగా చేగుంట మండలం పులిమమిడి గ్రామానికి చెందిన గౌతమ్ ఎన్నికయ్యాడు. సోమవారం మెదక్‌లో దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

ఉత్సాహంగా 2కే రన్



2కే రన్‌లో నాయకులు, అధికారులు, విద్యార్థులు, యువత

తూప్రాన్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మున్సిపల్ పరిధిలోని పోతరాజ్‌పల్లి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు సోమవారం అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత జాతీయ జెండాలతో 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్, ముఖ్య అతిథిగా గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, ఆర్డీఓ శ్యామ్ ప్రకాష్, డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్‌ఐ సురేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మోహన్, మండలాధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, సర్పంచ్‌లు, వార్డు కౌన్సిలర్లు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చిలప్‌చెడ్(నర్సాపూర్): అనారోగ్యాలకు గురై చికిత్స చేయించుకోలేని నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంగా మారిందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన నర్సాపూర్ క్యాంపు కార్యాలయంలో మండలంలోని అజ్జమర్రి గ్రామానికి చెందిన పుష్పకు రూ. 17.5 వేల చెక్కు, దుర్గమ్మకు సంబంధించిన రూ. 40 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల బీఆర్‌ఎస్ నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో అజ్జమర్రి సర్పంచ్ పరశురాంరెడ్డి, వైస్ ఎంపీపీ విశ్వంభర, సొసైటీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మాణిక్యరెడ్డి పాల్గొన్నారు.

◆ చెరువు కట్ట పనులు ప్రారంభం

మనోహరాబాద్(తూప్రాన్): పరిశ్రమల వాళ్లు స్వచ్ఛందగా గ్రామాల అభివృద్ధికి ముందుకు రావడం సంతోషకరమని మనోహరాబాద్ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం మనోహరాబాద్ గ్రామ ఊర చెరువు కట్ట వెడల్పు పనులు చేపట్టడానికి ఐటీసీ పరిశ్రమ యాజమాన్యం సోమవారం చెరవు కట్ట మరమ్మతు, వెడల్పు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పాక్స్ డైరెక్టర్ జావీద్‌పాషా, అయిలయ్య, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ పోలింగ్ బూత్‌ల పరిశీలన

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని గడిపెద్దాపూర్, ముస్లాపూర్ గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను సోమవారం తహసీల్దార్ తులసీరాం పరిశీలించారు.

◆ లక్ష ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): కుల వృత్తులకు ప్రభుత్వం అందిస్తున్న రూ. లక్ష ఆర్థిక సాయానికి కోసం దరఖాస్తు చేసుకోవాలని రజక సంఘం యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ అన్నారు.

◆ ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

నిజాంపేట(మెదక్): మండలంలోని పలు ఫర్టిలైజర్ డీలర్ల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి సతీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు పలు ఫర్టిలైజర్ డీలర్ల దుకాణాలల్లో రికార్డ్‌లను పరిశీలించారు. నకిలీ విత్తనాలను ఫర్టిలైజర్ డీలర్లను విక్రయించొద్దని హెచ్చరించారు.

◆ సన్మానం

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న మాలతి జిల్లా స్థాయిలో ఉత్తమ తహసీల్దార్‌గా ఎంపికైంది. దీంతో మాసాయిపేటలో పలువురు ఆమెను సోమవారం సన్మానించారు. జాతీయ ఎమ్మార్పీఎస్ నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ, మాజీ సర్పంచ్ చిటిమిల్ల నాగరాజు, పైతర అశోక్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింలు, నాయకులు తదితరులున్నారు.

◆ విరాళం

శివ్వంపేట(నర్సాపూర్): సమాజంలో అందరూ భక్తి భావంతో మెదలాలని జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా అన్నారు. మండలంలోని బిజ్లీపూర్ గ్రామంలో నూతనంగా వీరహనుమాన్ ఆలయంతో దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా జెడ్పీటీసీ సోమవారం రూ.50 వేల నగదు విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

◆ ఇండియన్ బ్యాంకు మేనేజర్‌గా లక్ష్మి

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ఇండియన్ బ్యాంకు మేనేజర్‌గా లక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన మేనేజర్ దేవేంద్ర చిత్తూరుకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో మహబుబ్‌నగర్ జిల్లా గుడిమల్కాపూర్ నుంచిలక్ష్మి బదిలీ పై వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు బదిలీపై వెళ్లిన మేనేజర్‌తో నూతన మేనేజర్‌ని సన్మానించారు.

◆ రుక్మాపూర్ చెరువు పరిశీలన

చేగుంట(తూప్రాన్): మండలంలోని రుక్మాపూర్ చెరువును ఇరిగేషన్ డీఈ రాజేందర్ సోమవారం సందర్శించారు. గ్రామంలోని చెరువు కట్టను మత్తడి సమీపంలో ధ్వంసం చేసి, పొలాలుగా మార్చారనే గ్రామస్తుల ఫిర్యాదు మేరకు చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువుకట్టను తొలగించిన వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని డీఈ హెచ్చరించగా, రెండు రోజుల్లో చెరువుకట్టను సరి చేస్తామని సంబంధిత వ్యక్తులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యనారాయణ, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

◆ ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

చేగుంట(తూప్రాన్): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్మిణీ, సత్యభామ సమేత వేణు గోపాలస్వామి విగ్రహాలతో పాటు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. వేదపండితులు శ్రీధరాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహరెడ్డి, బాల్‌రెడ్డి, రాజగోపాల్, వైష్ణవభక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ ఇంటర్ థియరీ పరీక్షలు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు థియరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఉదయం ప్రథమ సంవత్సర, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. సోమవారం నిర్వహించిన ప్రథమ సంవత్సరంలో 393మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 366 మంది హాజరై 27మంది గైర్హాజరయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 1351 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1262 హాజరై 89మంది గైర్హాజరయ్యారు.

◆ పాపన్న కుంటను కాపాడాలని వినతి

నర్సాపూర్ రూరల్: మండలంలోని నత్నయపల్లిలోని పాపన్న కుంటను కబ్జా నుంచి కాపాడాలని కోరుతూ సోమవారం నత్నయపల్లి గ్రామస్తులు నర్సాపూర్‌లోని ఆర్డీఓతో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. పాపన్న కుంటను వర్మ అనే వ్యక్తి కబ్జా చేసి తన ఆధీనంలోకి తీసుకుంటున్నాడని ఆరోపించారు. దీంతో ఆయకట్టు రైతులము తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాపన్న కుంటను పరిశీలించి బాధితుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ ఒకటి రెండు వర్షాలకు విత్తనాలు విత్తొద్దు

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని రైతులు ఖరీఫ్‌లో ఒకటి, రెండు వర్షాలకు ఎప్పుడూ కూడా తొందరపడి విత్తనాలను పెట్టొద్దని పెద్దశంకరంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు రాం ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... విపరీతమైన ఎండలు కొండతున్నాయని, కొద్దిపాటి వర్షానికే పంటలు సాగు చేయకూడదని సూచించారు. నేల పూర్తిగా తడిసిన తర్వాతే రైతులు విత్తనాలను విత్తుకోవాలని సూచించారు.